
# సహాయం

బొగ్గరమూడి కుసుమ



కమల చేతిగడియారం చూసుకొన్నది. టైము రెండు దాటింది. హన్మకొండ వెళ్ళే బస్సింకా రాలేదు. అన్ని స్టేషన్లకూ బస్సులొస్తున్నాయి. జనాన్ని నింపుకొని వెళుతున్నాయి. అయినా జనం తరగటం లేదు. తోడినకొద్దీ బావి లోనికి నీరూరి నట్లుగా జనం ఊరుకొస్తున్నారు. కమలకి చిరాకేసింది. చేతి బ్యాగు, చిల్లర సామాన్ల బుట్టకేసి చూసింది. తీసుకొనవలసిన సామాన్లన్నీ తీసుకొన్నట్లుగా గుర్తుచేసుకొన్నది.

అర్ధగంట గడిచింది. బస్సింకా రాలేదు. క్షణక్షణానికి ప్రయాణాన్ని గూర్చిన ఆదుర్దా ఆమెకి ఎక్కువైపోతున్నది. చేతిబ్యాగులో నుంచి వారపత్రిక తీసి పేజీలు తిరగేయబోయింది. ఇంతలో చెదిరిపోతున్న ఆమె చిత్తాన్ని పట్టిపేస్తూ "పాపులాకి పాతిక ... తీయ తీయగా, పుల్లపుల్లగా ... రుచికరమైన పిప్పరమెంట్లు..." రంగుల బుట్టలో పిప్పరమెంట్లు నింపుకొన్న యువకుడు. "పూలు ... మందారాలు ... గులాబి ... చేమంతి..." నాలుగు పదులు దాటిన ముత్తయిదువ. "మంచి పాటల పుస్తకాలు...కొత్త పాటలు ఏరి కూర్చిన న్యూసాంగ్స్...భాస్కర దండకం... ఆంజనేయ దండకం..." చంకసంచినిండా పుస్తకాలు నింపుకొన్న వయస్సు మళ్ళిన పెద్దమనిషి జనాన్ని ఆకట్టుకునే ప్రయత్నంలో అరుస్తూతిరుగుతున్నారు. కమలకి మరచిపోయిన వస్తువు గుర్తుకొచ్చింది. పూలమ్మిని పిలిచి మందారాల దండ తీసుకొని తలలో ముడుచుకొన్నది. చేతిపర్సులోని చిల్లరపోగా ఆమెకు ఛార్జీ డబ్బు మటుకే మిగిలింది.

కమల తిరిగి వారపత్రిక తెరిచింది. సంపాదకీయం కథలు చదివే ఓపికలేక కార్టూన్లు చూస్తూ తనలోతాను నవ్వుకోసాగింది. "అమ్మా ఒక్కపైస దానం చేయండి" తలెత్తి చూసింది. ఎదురుగా ఇరవై సంవత్సరాలునిండిన యువకుడు ముందుకి సాచి కుడిచేయి చిటికెన వ్రేలు నుంచి మూడేళ్ళు తెగి వున్నాయి. ఎడమకాలు పాదం మెలిపోవటం వలన ఊతగా చంకలో కర్ర వేశాడు. చిరిగిన చొక్కాలో నుంచి వాడి నల్లటి మురికి శరీరం వికారంగా కనిపిస్తున్నది. మాసి పట్టికొడుతున్న పైజామా పర్యంతను దాస్తున్నట్లుగా వ్రేలాడుతూంది. ఆరిపోతున్న దీపంలా వెలుగుతున్న కళ్ళతో వాడి ముఖం అమాయకంగా కనిపిస్తూంది. "రెండ్రోజులనుంచి అన్నంలేదు, ఒక్క పైసా ధర్మంచేయండి" గాలికి కదిలే మొక్కలా మనిషి ఊగిపోతున్నాడు. కమల దృష్టి సాచిన వాడి అరచేతి మీద పడింది. ఐదారు పైసల చిల్లరవున్నది దీనంగా వెలుగుతున్న వాడి కళ్ళల్లోని కాంతికి, దయనీయమైన అర్థింపులోని కంఠధ్వనికి కమల హృదయం కరిగిపోయింది. అప్రయత్నంగాఆమె చేయి పర్సులోనికి దూరింది. చేతికి ఒకే కాగితం తగిలి 'టప టప' లాడింది. ఛార్జీకి పోను తనకు మిగిలేది:- ఇరవై పైసలు:: నిస్సహాయంగా ఆమె హృదయం నిట్టూర్చింది. క్షణాల ఆలశ్యానికే వాడి కళ్ళు ఆశగా మెరిశాయి. 'వెళ్ళు'ని చెప్పటానికి ఆమెకి తలప్రాణం తోక్కొచ్చింది. ఏదో తెలియని బరువు - బాధ గుండెల్లో నిండుకొన్నట్లు అనిపించింది. వాడు కర్ర కాలుని ఎత్తిపట్టి కదల్లేక ముందుకి కదిలాడు. "బాబూ ఒక్కపైస. అమ్మా ఒక్కపైస." బస్సుకొరకు ఎదురు చూస్తూ నిలుచున్న ప్రతి ఒక్కర్నీ అడిగినవార్ని-అడగనివార్ని అడుగుతూ తిరుగుతున్నాడు. ఒక రిద్దరు ఒకటి-రెండు పైసలేశారు. కొందరు వేయబోయి చిల్లర లేదనో, పది, పావలా బిళ్ళలుండీ వేయటం ఇష్టంలేకనో 'వెళ్ళవే' ఓపికలేక తల లూగిస్తున్నారు.

కమల అతి కష్టంమీద వాడినుంచి దృష్టి మరల్చుకొన్నది. వారపత్రిక పేజీలు త్రిప్ప సాగింది. ఎంతకూ ఆమెలో ఉత్సాహం కలగటం లేదు. లోగడ నవ్వు పుట్టించిన కార్టూన్లు సహితం ...ఆ క్షణములో ఆమెకి ఆర్.టి.సి. కార్పొరేషన్ మీద ఎక్కడలేని కోపం వచ్చింది. "ఛీ...ఏం బస్సులు..." గొణుక్కొన్నది.

"హోరా" కర్ణ కఠోరమైన శబ్దానికి తల త్రిప్పి చూసింది కమల. పది గజాల దూరములో ముగ్గురు గొట్టం పాంట్లు పిల్లాళ్ళు, ఖద్దరు లాల్చీ ధరించి మడిచిన ఎడమ చేతికి గొడుగు వ్రేలాడేసి కుడి చేత పేపర్ని పట్టుకొని ఊపుతూ నిలుచున్న పెద్ద మనిషి, దిగిన బొర్రతో సాఫీగా నడవలేక యమయాతన్ని అనుభవిస్తున్న వాడికి మళ్లీ ముఖానికి పెట్టిన మూడు నామాల్ని పైకీ-క్రిందికీ కదుపుతూ మధ్య వయస్సు షావుకారు - దగ్గరగా సాచిన మూడేళ్ళు తెగిన చేయి.

"చెప్పేది నీక్కాదు. లేవంటుంటేవెళ్ళవేంరా" గుబ్బురిమాడు గొట్టం పాంటున్న నల్లటి పొట్టిపిల్లాడు. పేరు రంగారావు.

"అడుక్కు తినటం ప్రతి వెధవకీ ఈ రోజుల్లో వ్యాపారమైంది." ఖద్దరు లాల్చీ పెద్ద మనిషి గోపాలరావు అన్నాడు."

(మిగతా 44 వ పేజీలో)

# సహాయం

[4 వ పేజీ తరువాయి]

"నిజం చెప్పారు. ఇంట్లోనుంచి కాలు బయట పెడితే చాలు ముందుగా కళ్ళకి కనిపించేది?" బుంగ పట్టిన షాహుకారి బుగ్గలు బూరెల్లా వుబ్బటముతో గారపట్టిన పండ్లు వికారంగా బయటికి కనిపించాయి.

"పోనీరా వాడి వ్యవహారం బస్సు వచ్చేసరికి వెళ్ళొద్దాంరా హోటల్లోకి" రంగారావు నడుం చుట్టు చేయివేసి లాగాడు గొట్టం పాంటు పిల్లాడు.

"వద్దురా బాబు వద్దు. ఇంతకి పూర్వమే గొంతు వరకు మెక్కివచ్చాను." జేబులో నుంచి సిగిరెట్టు తీసి మిత్రుడిద్దరికి అందించ బోయాడు.

"పోనీ, కాఫీ మాత్రమే. అదీ టూబై త్రీ... నా?" మూడవ గొట్టంపాంటు పిల్లాడు రంగారావు చేయి పట్టుకొని లాగాడు. ముగ్గురు చేయి చేయి పట్టుకొని నవ్వుతూ హోటల్ కేసి నడిచారు.

అంతవరకూ సిమెంటు బెంచి మీద కూర్చున్న గోపాలరావు భార్య మారాం చేస్తున్న బాబుని గట్టిగా చంక నెత్తుకొని దగ్గరగా వచ్చింది." ఏం పిల్లాడో... నా ప్రాణాలు తోడేస్తున్నాడు." భర్త కందించింది.

"ఏమంటున్నాడు," నవ్వుతూ బాబు ముఖము కోసికి చూచాడు. మూడు సంవత్సరాలు నిండిన బాబు తండ్రికి దూరంగా జరుగబోయాడు. "బిస్కట్లు ఇవ్వకపోయావా?" భార్య చేతిలోనుంచి బిస్కట్లు పొట్లం తీసి బాబుకి అందించాడు. "వద్దు" బిస్కట్లు పొట్లం విసిరి నేలకి కొట్టాడు బాబు. త్రుటి కాలంలో తల్లి కళ్ళల్లో మెరిసిన కోపంతో బాబు బుగ్గ పిండ బోయింది. గోపాలరావు వారించాడు. "ఏంకావాలి చెప్పమ్మా" గారాబం పుట్టిపడేలా బాబుని బుజ్జగించ సాగాడు గోపాలరావు.

"తాతయ్యా పోదాం... పా..." మురిపెం పుట్టిపడేలా ముద్దు ముద్దుగా అన్నాడు బాబు. నవ్వుకొన్నాడు గోపాలరావు.

"బస్సు రాగానే పోదాం" బాబుని బుజ్జగిస్తూ పళ్ళ దుకాణాలకేసి నడిచాడు బాబు నెత్తుకొని.

నేలమీద పడి బిస్కట్లు ముక్కలయ్యాయి. మూదేళ్ళు తెగిన ఊతకర్ర కుంటివాడు ఆశగా ముందుకి కదిలాడు. అంతవరకు ఎక్కడో దాగిన గజ్జి కుక్కలు రెండు "బౌ" మంటూ ముందుకి దుమికేసరికి వాడి 'వొళ్ళు' ఝల్లుమన్నది. వాడు తేరుకొని ముందుకి చూసేసరికి నేల మీద నాలుగు బిస్కటు ముక్కలు కుక్కలు తినేశాయి.

కమల దృష్టి మరల్చుకొన్నది. తనకేసి అదే పనిగా కొందరు చూస్తూండటము గమనించి ఇబ్బందిగా అటు - ఇటు కదిలింది. క్షణాలు గడుస్తుంటే తనవే కాదు స్టాండులో ఏదో పొగొట్టుకొన్నవారికి మళ్లె కొందరు తిరగటం చూచి ఉడుక్కొన్నది.

* * *

టైము మూడు దాటింది. బస్సింకా రాలేదు. ఒకరిద్దరు కంట్రోలు రూమ్ కెళ్ళి బస్సు రాకపోవటము గురించి అరచి వచ్చారు. అప్పటికే రెండు బస్సులు నిండేట్టు జనం పోగయ్యారు. కమలకి గుండెలు 'దడ దడ' లాడాయి. ఇంత జనాన్ని త్రోసుకొని తను బస్సు ఎక్కగలదా? "పావలాకి పాతిక... తీయటి, పుల్లగా, రుచికరమైన పిప్పర మెంట్లు", "పూలు...గులాబి, మందారాలు", "పుస్తకాలు..వెంకటేశ్వర సుప్రభాతం, అంజనేయ దండకం", "అమ్మా, ఒక్క పైస ... అయ్యా, ఒక్క పైస" జనాన్ని ఆకట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. 'కీసు' మన్న సోడా, 'బర బర' లాడుతూ మిరియాలగూడ బస్సు కదిలింది.

కమల కంగారుగా చేతిబ్యాగు, చిల్లరసామాన్ల బుట్ట వెదుకసాగింది. వెదుకుతున్న ఆమెకి క్షణ క్షణం కంగారెక్కువై పోతున్నది.

"ఏం పోయిందమ్మా?" పక్కన కూర్చొన్న ముత్తయిదువ అడిగింది, కమల సామాన్లు అటు-ఇటు కదపటం గమనించి.

"పర్సు" కమలకి అతి కష్టంమీద గొంతు పెగిలింది.

"ఏమిటి డబ్బా?!" ఆశ్చర్యములో ఆమె గొంతు అరటి పువ్వులా విప్పుకొన్నది. అక్కడున్న వారందరిలో కదలిక ప్రారంభమైంది. ఎవరి సామాన్లు వారు జాగ్రత్తగా చూసుకొన సాగారు. సామాన్లులేని పిడిమనుషులు కొందరు కమలని చుట్టారు "ఎట్లా పోయింది? ... ఎంత పోయింది?" కమల చెప్పలేక విసుగుపడింది.

"పాపం, ఆడకూతురు ఎటా యిల్లు చేరుతుంది?" ఎవరో సానుభూతిని వ్యక్తంచేశారు. "ఏ ఊరు వెళ్ళాలి?... చార్జీ ఎంత??... తోడు యెవరూ లేరా?... ఒక్కరేనా?" ప్రశ్నల వర్షం!!!

ఎవరికీ యేం సమాధానం చెప్పలేక వచ్చిన అభిమానముతో బిక్కముఖ మేసి చూస్తుండి పోయింది కమల. ఆమె ఏ ఊరు వెళ్ళాలో తెలుసుకోగానే ఒకరు చార్జీ యెంతో లెక్కేసి చెప్పారు. చార్జీ మాట వినగానే యెక్కడ సహాయం చేయవలసివస్తోందోనని కొందరు దూరంగా తప్పుకున్నారు.

"చార్జీయేగా ఆఫ్టరాల్ బస్సురాని టిక్కట్టు కొనిద్దాం" రంగారావు ఛాతీ విరిచాడు.

"పెద్ద పోజు పెట్టకురా ఒక్కడివే భరించేట్టు" హోటల్ కి లాక్కుపోయిన గొట్టంపాంటు పిల్లాడు భుజం కుదిపాడు.

"అదీ! తలో రూపాయి" నవ్వాడు ఖద్దరు లాల్చీ పెద్ద మనిషి గోపాలరావు అదోలా ముఖం పెట్టి కమలను చూస్తూ. చూస్తుండగానే పదిరూపాయలు పోగయ్యాయి. "తీసుకోండి మేడమ్. దానం కాదు. ధర్మం అంతకన్నాకాదు. పరిస్థితిలోచిక్కుకొన్నారు. కాబట్టి సానుభూతిగా... నో ... మనిషికి చేయవలసిన సహాయం..." రంగారావు కమల చేతి బ్యాగు మీద రూపాయిలు పెట్టాడు.

అతి బరువుగా సిగ్గుని చంపుకొన్న నేత్రాలతో తలెత్తి అందరికేసి చూచింది కమల. తనమీద సానుభూతిని వ్యక్తం చేస్తున్న వారిలా వాళ్ళు కనిపించలేదు. అధికృతని వ్యక్తంచేసే దర్పం వాళ్ళముఖంలో ప్రతిబింబిస్తూంది. వాళ్ళని ఎవరు అడిగారు? నాకెందు కిచ్చారు?? విసిరి వాళ్ళ డబ్బు వాళ్ళ ముఖాన కొట్టాలనిపించింది. కానీ...

"అయ్యా ఆకలి... అమ్మా ఆకలి... రెండ్రోజులనుంచి అన్న లేదు. దయగల తల్లుల్లారా... జాలిగుండె గల తండ్రుల్లారా... ధర్మం చేయండి..." మూదేళ్ళు తెగిన కుడి చేయి సాచి ఆశ నింపుకొన్న కళ్ళలో మనిషి మనిషిని అడుగుతూ కుంటికాలికి ఊతగా వున్న కర్ర కాలిని ఎత్తి గాలికి కదులాడే మొక్కలా ఊగుతూ వస్తున్నాడు. ఇంతలో బస్సు వస్తూందని ఎవరో అరిచారు. బ్యాగుమీద పైసల్ని పిడికిలి పెట్టిన కమల సాచిన మూదేళ్ళు తెగిన వాడి చేతిలో పెట్టింది. బస్సువచ్చి ఆగింది. అందరు తెల్లబోయిచూస్తుండగా జాకెట్టులోంచి పర్సుతీసి పిడికిలి పట్టినకమల చేతిలో నోటు 'టప టప' లాడింది.

